




# కరపత్రం

SINCE 2014

సోమవారం డిసెంబర్ 9 2024 | సంపుటి :0 | సంచిక : 61 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4




## ట్యాంక్‌బండ్‌పై ఎయిర్ షో.. వీక్షించిన సీఎం, మంత్రులు

హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన ఎయిర్ షో ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅథిగా హాజరై ఎయిర్ షోను ప్రారంభించారు. 15 సూర్య కిరణ్ విమానాలతో చేసిన విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఎయిర్ షోను తిలకించేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఎంతో పాటు శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఎయిర్ షోను వీక్షించారు.



## రైతుల కోసం ధరణి కొత్త యాప్, కొత్త చట్టం: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



- కమిటీ నివేదిక ఆధారంగా ధరణి పోర్టల్‌ను ఎలా ప్రక్షాళన చేయాలో చూస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.
- రైతులకు మంచి జరిగే ప్రతి సూచననూ స్వీకరిస్తామన్నారు.

హైదరాబాద్: ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు " మా ప్రభుత్వం వచ్చాక ధరణిలో కొన్ని మార్పులు చేశాం. పోర్టల్ నిర్వహణను ఈ నెల ఒకటో తేదీ నుంచి విదేశీ సంస్థ నుంచి ఎన్ఐసీకి మార్చాం. 2020 ఆర్‌వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్‌వోఆర్ చట్టం తెస్తున్నాం. కొత్త చట్టాన్ని రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేస్తాం. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్య ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది" అని అన్నారు. గత ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందని, కానీ, రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలని స్థానికులు కోరుకుంటున్నారని చెప్పారు.

## టీఫైబర్ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: టీఫైబర్ సేవలను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. దీని ద్వారా తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజా విజయోత్సవాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీ ఫైబర్ ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీ వినియోగించవచ్చని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సేవలను పరిశీలించి మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. టీ ఫైబర్ ద్వారా సంగారెడ్డి జిల్లా శ్రీరాంపూర్ వాసులతో ఆయన మాట్లాడారు. మీసేవ మొబైల్ యాప్‌ను శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఇందులో కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతులకు రుణమాఫీ, బోనస్ కోసం మొబైల్ అప్లికేషన్ ప్రారంభించినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.

## సిగ్నలింగ్ వ్యవస్థలో సమస్య.. ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైళ్లు

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో హైదరాబాద్ నుంచి నాగ్‌పుర్ వెళ్లే వందే భారత్, దిల్లీ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు అరగంట పాటు నిలిచిపోయాయి. సిగ్నలింగ్ వ్యవస్థలో సమస్యతో ఈ ఘటన చోటు చేసుకుంది. అనంతరం వీటిని రైల్వే అధికారులు స్టేషన్ నుంచి పంపించారు. ఉప్పల్ స్టేషన్‌లో సింగరేణి ప్యాసింజర్ 20 నిమిషాలుగా ఆగిపోయింది. మెయిన్‌లైన్‌లో గూడ్స్ రైలు కూడా ఆగింది. మరోవైపు సిగ్నలింగ్ సమస్య కారణంగా ఉప్పల్ ఆర్వోబీ సమీపంలో రైల్వే గేటు తెరుచుకోకపోడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు.



## రాష్ట్రంలో దుర్భర పరిస్థితులపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం : కేటీఆర్

- తెలంగాణలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని.. ప్రజా సమస్యల పరిష్కారంపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు.



2 లో

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆదివారం ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు.

## తెలంగాణ తల్లి విగ్రహం మార్పు మూర్ఖత్వం: కేసీఆర్



హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్చడం మూర్ఖత్వమని మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా? మార్పులు చేసుకుంటూ పోతే ఎలా? అని ప్రశ్నించారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. "ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి. భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశాలకు రావాలి. అంశాలవారీగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి. రైతు బంధు తెచ్చిన ఉద్దేశం, ప్రయోజనాలు వివరించాలి. ఉద్యమంలో తెలంగాణ తల్లి అందించిన స్ఫూర్తిని వివరించాలి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. మూసీ, హైడ్రా విషయంలో ప్రభుత్వ వైఖరి, గురుకులాలు, విద్యారంగంలో వైఫల్యాలను ఎండగట్టాలి. నిర్బంధ పాలన గురించి అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలి. కాంగ్రెస్ మేనిఫెస్టో ఆధారంగా వైఫల్యాలను ఎత్తి చూపాలి. ఫిబ్రవరి బహిరంగ సభలో సర్కారు వైఖరిని ఎండగడతాం. ఫిబ్రవరి తర్వాత పార్టీలో అన్ని కమిటీలు ఏర్పాటు చేస్తాం. కమిటీల ఏర్పాటు తర్వాత సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుంది" అని కేసీఆర్ తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ.. ఇద్దరు కానిస్టేబుళ్ల మృతి

- జాలిగామ బైపాస్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు కానిస్టేబుళ్ల మృతిచెందారు.



02

గజ్వేల్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు కానిస్టేబుళ్ల మృతిచెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని జాలిగామ బైపాస్‌లో చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై కానిస్టేబుళ్లు పరందాములు (43), వెంకటేశ్వర్లు (42) గజ్వేల్‌కు వస్తుండగా ఈ ఘటన జరిగింది.

## కాంగ్రెస్ మాత విగ్రహాన్ని సెక్రటేరియట్‌లో కాదు.. గాంధీభవన్‌లో పెట్టుకోండి.. సీఎం రేవంత్‌పై జగదీశ్ రెడ్డి ధ్వజం



02

నిత్యం కేసీఆర్ నామస్మరణ చేస్తున్నదే సీఎం రేవంత్ రెడ్డి అని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రజల మనసుల్లో ఉన్నారని తెలిపారు. నరసింహస్వామిలాగా ఎప్పుడూ కేసీఆర్ బయటకు వస్తారో అని రేవంత్ రెడ్డి భయపడుతున్నారని పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం డిసెంబర్ 9 2024

# కాంగ్రెస్ మాత విగ్రహాన్ని సెక్రటేరియట్‌లో కాదు..

## గాంధీభవన్‌లో పెట్టుకోండి.. సీఎం రేవంత్‌పై జగదీశ్ రెడ్డి ధ్వజం

మొదటిపేజీ తరువాయి
నల్గొండలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి రూపు రేఖలు మార్చడంపైనా విమర్శలు గుప్పించారు. అది తెలంగాణ తల్లి విగ్రహం కాదని.. కాంగ్రెస్ మాత విగ్రహమని అన్నారు. కాంగ్రెస్ మాత విగ్రహాన్ని సెక్రటేరియట్‌లో పెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కావాలంటే ఆ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో పెట్టుకోవాలని సూచించారు.

దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వెనుకబడిందని జగదీశ్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో జిల్లాను సస్యశ్యామలం చేసినందుకు గర్వపడుతున్నానని అన్నారు. 2014లో ఉన్న 7వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 24వేల మెగావాట్లకు పెంచిన ఘనత కేసీఆర్‌దే అని కొనియాడారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను అడ్డుకుంటామని ఆనాడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రగల్భాలు పలికారని గుర్తుచేశారు. నిన్న జరిగిన ఆ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఎక్కడ అడ్డుకుంటాడో అని భయపడ్డానని తెలిపారు. పవర్ ప్లాంట్‌ను అడ్డుకోనందుకు కోమటిరెడ్డికి ధన్యవాదాలు అని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీ, బ్రాహ్మణవెల్లంల లకు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నిధులు మంజూరు చేసినట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు. .

కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు ఏం లాభం జరగలేదని.. మంత్రుల జేబులు మాత్రం నిండాయని జగదీశ్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో 5 లక్షలకు పైగా బోరుబావులు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన ఉచిత కరెంటుతో అధికంగా లాభపడ్డది నల్లగొండ జిల్లానే అని చెప్పారు. అదే కాంగ్రెస్ ఏడాది కాలంలో రైతుబంధు, బీమా, రుణమాఫీలో నల్గొండ తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. రాష్ట్రంలో రైతులకు ఎగ్గట్టింది 30 వేల కోట్లు అయితే.. ఇచ్చింది కేవలం 12 వేల కోట్లు మాత్రమే అని తెలిపారు. ఎక్కడా పూర్తిగా రుణమాఫీ జరగలేదని అన్నారు. దీన్ని లెక్కలతో సహా బయటపెడతానని స్పష్టం చేశారు. నల్గొండలో సీఎం పర్యటనలో మూడు బూతులు ఆరు ఏతులు తప్పా ఇంకోటి లేదని జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. తమ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గతేడాది ట్రయల్ రన్ చేసిన దాన్నే.. సీఎం రేవంత్ రెడ్డి నిన్న మళ్లీ ట్రయల్ రన్ చేశారని తెలిపారు.

కేసీఆర్ హయాంలో చేపట్టి పూర్తికావచ్చిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, మెడికల్ కాలేజీ, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. తాము శంకుస్థాపన చేసిన పథకాలనే కాంగ్రెస్ నాయకులు ఓపెన్ చేస్తున్నారని జగదీశ్ రెడ్డి తెలిపారు. కొత్తగా ఒక్క పని చేసే సత్తా కాంగ్రెస్ నాయకులకు లేదని అన్నారు. దమ్ముంటే శంకుస్థాపనలు చేసి.. పనులు పూర్తి చేయాలని సవాలు విసిరారు. దీనిపై మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వేటాడుతానని అన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని తెలిపారు. ఏడాది పాలనలో కాంగ్రెరెస్ నాయకుల జేబులు

# ఒకవేళ మీరు గెలిచి ఉంటే..: శిందే మండిపాటు

ముంబయి: మహారాష్ట్రలోని ప్రతిపక్షాలపై డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే మండిపడ్డారు. ఈవీఎంలపై చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించకూడదంటూ విమర్శించారు. విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"ఈవీఎంలపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి ప్రజలకు అవాస్తవాలు చెబుతున్నారు. ముందుగా ఎన్నికల ఫలితాలను అంగీకరించండి. ఒకవేళ ఎన్నికల్లో మీరు గెలిస్తే.. ఈవీఎంలపై ఇలాంటి ఆరోపణలు చేసేవారు కాదు. ఓడిపోయారు కాబట్టే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఓడిపోయామని ప్రతిపక్షాలు అంగీకరించక తప్పదు" అని శిందే విరుచుకుపడ్డారు.

"లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మహాయుతి కూటమికి 43.55 శాతం ఓట్ల దక్కగా.. ఎంవీఏకు 43.71 శాతం



వచ్చాయి. ప్రతిపక్ష కూటమికి 31 సీట్ల రాగా.. అధికార కూటమికి 17 సీట్లు మాత్రమే వచ్చాయి. అక్కడ మరి స్కామ్ జరిగినట్లు చెప్పాగలరా..?" అని ప్రశ్నించారు. కాగా.. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో ఎన్నిక ఫలితాల్లో 230 సీట్లతో మహాయుతి భారీ విజయం సాధించింది. దీనిపై స్పందించిన ప్రతిపక్షాలు ఈవీఎం ట్యాపరింగ్ జరిగిందంటూ ఆరోపిస్తున్నాయి.

సరిహద్దులు శత్రుదుర్భేద్యం.. త్వరలో యాంటీ డ్రోన్ విభాగం: అమిత్ షా

ఫలితాలపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. ఈవీఎంలపై ప్రజల్లో విశ్వాసం లేదని.. అయినా ఓటు వేశారని అన్నారు. ప్రపంచమంతా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తుంటే.. భారత్‌లో మాత్రమే ఈవీఎంలు ఎందుకని ప్రశ్నించారు. తాజాగా స్పందించిన శిందే ఈ వ్యాఖ్యలు చేశారు.

## నిధుల వినియోగంలో కేరళ ప్రభుత్వం విఫలమైంది: భాజపా




తిరువనంతపురం: కేరళ ప్రభుత్వంపై భాజపా తీవ్ర స్థాయిలో మండిపడింది. వయనాడ్‌లో వరదలు సృష్టించిన విలయంలో సర్వం కోల్పోయిన బాధితులకు పునరావాసం కోసం కేంద్రం నిధులను కేటాయించిందని..కానీ వాటిని సరైన విధంగా వినియోగించుకొని, ప్రజల సమస్యలు తీర్చడంలో కేరళ ప్రభుత్వం విఫలమయ్యిందని ఆరోపించింది.

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి , జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి ద్వారా నరేంద్ర మోదీ ప్రభుత్వం కేరళకు తగినన్ని నిధులు సమకూర్చింది. కానీ పినరయి ప్రభుత్వం వాటిని వినియోగించకుండా ఆలస్యం చేస్తూ..అందుకు కేంద్రాన్ని నిందిస్తోంది." అని భాజపా సీనియర్ నేత ప్రకాష్ జవదేకర్ అని ఆరోపించారు. ఎస్‌డీఆర్ఎఫ్ కింద రూ. 500 కోట్లు, ఎన్డీఆర్ఎఫ్ ద్వారా రూ.700 కోట్లను కేంద్రం కేటాయించిందని.. అయినా వాటిని రాష్ట్ర ప్రభుత్వం బాధితుల కోసం ఉపయోగించలేదని అన్నారు. వయనాడ్ విలయం సమయంలో దేశవ్యాప్తంగా ప్రజలు పెద్ద మొత్తంలో ఇచ్చిన విరాళాలను కేరళ ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. వయనాడ్ బాధితులకు పునరావాస కల్పనపై రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ఇటీవల చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ కేరళలోని అధికార, ప్రతిపక్షాలు కేంద్రంపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదనే విషయం కోర్టులో బయటపడిందని అన్నారు. వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల పునరావాసానికి సంబంధించి నిధుల గణాంకాలు సరిగ్గా లేవని కేరళ హైకోర్టు శనివారం రాష్ట్ర ప్రభుత్వం, దాని విపత్తు నిర్వహణ అథారిటీ ని విమర్శించింది. కాగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్యాకేజీతోపాటు అదనపు సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఎస్‌డిఆర్ఎఫ్‌లో నిధులు ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రమాణాల కారణంగా దాని నుండి ఖర్చు చేయడానికి ఆంక్షలు ఉన్నాయని, అందువల్ల కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల ప్రజల సమస్యలను దానితో పరిష్కరించలేమని రాష్ట్ర రెవెన్యూ మంత్రి కె రాజన్ న్యాయసానానికి తెలిపారు.

## సరిహద్దులు శత్రుదుర్భేద్యం.. త్వరలో యాంటీ డ్రోన్ విభాగం: అమిత్ షా



సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర యాంటీ-డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు.

దేశ సరిహద్దుల్లో.. ముఖ్యంగా పాకిస్థాన్‌తో నియంత్రణ రేఖ వెంబడి ప్రాంతాల్లో డ్రోన్ల అనుమానాస్పద కదలికలు భద్రతాబలగాలకు సవాల్ విసురుతున్నాయి. ఈ క్రమంలోనే సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర యాంటీ-డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాజస్థాన్‌లో బీఎస్ఎఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. బలగాలను ఉద్దేశించి ప్రసంగించారు. లేజర్‌తో కూడిన యాంటీ-డ్రోన్ గన్-మౌంటెడ్ మెకానిజం ప్రాథమిక ఫలితాలు సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. దీనిద్వారా పంజాబ్‌లో భారత్- పాక్ సరిహద్దులో ప్రత్యర్థి డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతల కేసులు 3 శాతం నుండి 55 శాతానికి పెరిగాయని వెల్లడించారు.

"రానున్న రోజుల్లో డ్రోన్ల ముప్పు మరింత పెరగనుంది. ఈ సమస్య పరిష్కారానికి డీఆర్డీవో, ఇతర రక్షణ, పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. త్వరలో సమగ్ర 'యాంటీ డ్రోన్ యూనిట్'ను ఏర్పాటు చేయనున్నాం. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో దేశ సరిహద్దులను శత్రుదుర్భేద్యం చేసేందుకు కొనసాగుతున్న 'సమగ్ర సమీకృత సరిహద్దు నిర్వహణ వ్యవస్థ' (సీఐబీఎంఎస్) పురోగతిలో ఉంది. ఉత్తరాది సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ఉద్దేశించిన 'వైబ్రంట్ విలేజ్ ప్రోగ్రామ్'ను దేశంలోని అన్ని సరిహద్దు పల్లెలకు అమలు చేయనున్నాం. దాదాపు 3,000 గ్రామాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నాం. సరిహద్దుల్లో ఇప్పటికే 1,812 కి.మీ రోడ్ల నిర్మాణంతోపాటు 573 కొత్త బార్డర్ పోస్టులను సృష్టించాం" అని అమిత్ షా తెలిపారు.

వారి త్యాగాలు మనసుల్ని కదిలిస్తున్నాయి: ప్రధాని మోదీ


అధికారిక వివరాల ప్రకారం.. పాకిస్థాన్‌తో భారత్ సరిహద్దులో 2023లో సుమారు 110 డ్రోన్ల కూల్చివేత/ స్వాధీనం ఘటనలు నమోదు కాగా.. ఈ ఏడాదిలో ఈ సంఖ్య 260 దాటింది. చాలావరకు డ్రోన్లు ఆయుధాలు, మాదకద్రవ్యాలను మోసుకెళ్తున్నట్లు బలగాలు గుర్తించాయి. పంజాబ్, రాజస్థాన్, జమ్మూలో ఈ ఘటనలు వెలుగుచూశాయి. ఇదిలా ఉండగా.. దాదాపు 2.65 లక్షల మంది సిబ్బందితో కూడిన సరిహద్దు భద్రతాదళం (%దీూఖీ%) 1965 డిసెంబర్ 1న ఏర్పాటైంది. ప్రధానంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో 6,386 కి.మీల పొడవైన సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ సిబ్బంది పహారా కాస్తుంటారు.

## ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలున్నాయి: శరద్ పవార్

ముంబయి: మహారాష్ట్ర లో మహాయుతి ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) సభ్యులు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. షోలాపూర్ జిల్లాలోని మర్కద్వాడి గ్రామంలో యాంటి-ఈవీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

"ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలున్నాయి. ఈవీఎంలపై ప్రజల్లో విశ్వాసం లేదు. అయినా.. ఓటు వేశారు. అమెరికా, ఇంగ్లాండ్‌తో సహా ప్రపంచమంతా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తోంది. భారత్‌లో మాత్రమే ఈవీఎంలు ఎందుకు? ఇక్కడి ప్రజలు బ్యాలెట్‌లతోనే ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారు" అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై స్థానిక ప్రజల్లో ఎలాంటి ఫిర్యాదులున్నా తనకు అందజేయాలని వాటిని ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపిస్తానని శరద్ పవార్ తెలిపారు.

మరోవైపు.. ఎన్నికల్లో ఈవీఎంలను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ.. ఎంవీఏ ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణ స్వీకారం చేసేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం వారు ప్రమాణస్వీకారం చేశారు.



## రైతుల కోసం ధరణి కొత్త యాప్, కొత్త చట్టం: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
2004-2014 మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చిందని మంత్రి పొంగులేటి అన్నారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014- 2023 మధ్య కాలంలో కేవలం 1.52 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మాత్రమే టెండర్లు పిలిచారన్నారు. గత ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని.. చేసి చూపించామని, ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపైనా భారాస రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. త్వరలోనే సర్వే వ్యవస్థను కూడా పటిష్ఠం చేస్తామని, ఇందుకోసం 1000 సర్వేయర్ల పోస్టులను భర్తీ చేస్తామని పొంగులేటి తెలిపారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ.. ఇద్దరు కానిస్టేబుళ్ల మృతి

మొదటిపేజీ తరువాయి
వీరిలో పరందాములు రాయపోలు, వెంకటేశ్వర్లు దౌల్తాబాద్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి

కానిస్టేబుళ్ల మృతిపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటానని తెలిపారు.

## రాష్ట్రంలో దుర్భర పరిస్థితులపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం : కేటీఆర్




మొదటిపేజీ తరువాయి
అనంతరం కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పకుండా ప్రభుత్వాన్ని నిలదీయాలని.. రాష్ట్రంలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల విషయంలో బలంగా వాణిని వినిపించాలని కేసీఆర్ సూచించారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యంగా వ్యవసాయరంగంలో దుర్భర పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలు నెరవేర్చక, నిలబెట్టుకోకపోయిందన్నారు.

అరకొరగా రుణమాఫీ చేసి.. రైతుభరోసా అనేది ఇంత వరకు లేకుండా చేసి.. కొనుగోలు కేంద్రాలు సరిగా నడపలేని పరిస్థితిపై, బోనస్ ఇవ్వకుండానే ఏదో చేసినట్లుగా నటిస్తూ.. ఇవాళ రైతులను దగా చేసి విజయోత్సవాల పేరిట మరొకసారి వారిని అవమానం పాలు చేస్తున్న వైనంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులందరికీ బీఆర్ఎస్ తరఫున మేం చెప్పేది ఒక్కటేనని.. మీ గొంతుగా శాసనసభలో, మండలిలో ప్రభుత్వాన్ని అన్ని విషయాల్లో నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతుబంధు, రుణమాఫీ, బోనస్‌తో పాటు రైతు కూలీలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని మీకు హామీ ఇస్తున్నామన్నారు.

### గురుకులాల ఎదుకు నీరుగారిపోతున్నయ్..

రాష్ట్రంలోని గురుకులాల్లో ఈ రోజు అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కావొచ్చు. ఆ పిల్లలందరినీ ప్రభుత్వమే తల్లీ తండ్రి అయి వారి ఆలనపాలన చూసుకుంటుందని ఆ తల్లిదండ్రులు భావిస్తారు. ఈ రోజు హాస్టల్స్‌లో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులను గురుకుల బాట ద్వారా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం వెలుగులోకి తీసుకువచ్చింది. ఆర్ఎస్ ప్రవీణ్ నాయకత్వంలోని కమిటీ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు అధ్యయన రిపోర్టును సమర్పించింది.

గతంలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన సబితా ఇంద్రారెడ్డి, సంక్షేమశాఖ మంత్రిగా పని చేసిన జగదీశ్‌రెడ్డి వారంతా తమ ఆలోచనలు, ఆ నాటి పరిస్థితులు.. ఆ రోజుల్లో ఎంత బాగా నడిచింది.. ఈ రోజు గురుకులాలు ఎందుకు నీరుగారిపోతున్నయో వివరించారని కేటీఆర్ తెలిపారు. గురుకులాలు ఆనాడు ఎంత చక్కగా నడిచాయో.. ఏ రకంగా విస్తరించాయో అవన్నీ ప్రజల కండ్ల ముందే ఉన్నయ్. వాటిని సంస్కారవంతంగా నడిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేసీఆర్ సూచించారన్నారు. తప్పకుండా అక్కడ నెలకొన్న పరిస్థితులను కళ్లకుకట్టినట్లు.. అవసరమైతే ఫొటోలు, ఆధారాలు, వివరాలతో సహా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కేసీఆర్ ఆదేశించారని.. తప్పకుండా మరో కార్యక్రమంగా తీసుకుంటామన్నారు.

### నిర్బంధకాండపై ప్రశ్నిస్తాం..

రాష్ట్రంలో దౌర్జన్యకాండ జరుగుతుందని.. అది కొడంగల్ నియోజకవర్గం, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్, ఇతర ప్రాంతాల్లో కావొచ్చని.. ఏ రకంగా ప్రభుత్వం ధౌర్జన్యంగా ఈ రోజు దళితులు, గిరిజనులపై దాడి చేస్తూ వారిని హింసిస్తుందని.. కేసులు పెట్టి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నదో తప్పకుండా ఈ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఒకవైపు హైదరాబాద్ ఫార్మా సిటీ పేరిట 14వేల ఎకరాలు సేకరించి మీ చేతులో పెట్టిన తర్వాత.. హైకోర్టులోనేమో ఫార్మాసిటీ ఉంటదని చెప్పి.. మళ్లీ 20 ఫార్మా విలేజ్‌లకు తెరలేపుతున్నారని ప్రశ్న తప్పకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. తప్పకుండా దళిత, గిరిజన, బలహీన వర్గాల రైతులు, సన్న, చిన్నకారు రైతులందరికి అండగా నిలబడి గట్టిగా మాట్లాడుతామన్నారు.

మా నాయకుడు పట్నం నరేందర్‌రెడ్డితో సహా 40 మంది రైతులు జైళ్లలో ఉన్నారని.. వారిని తక్షణమే విడుదల చేయాలని..భేషరతుగా క్షమాపణలు చెప్పి ఆ కేసులు ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. మా నాయకులు, శాసనసభలు, మండలి సభ్యులపై ఎక్కడికక్కడ వారి హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్నారు. మా నాయకురాలు కోవ లక్ష్మి సొంత నియోజకవర్గంలో ఓ అమ్మాయి గురుకుల పాఠశాలలో చనిపోతే పరామర్శకు బయలుదేరితో వారిని హౌస్ అరెస్ట్ చేశారన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని మూడు నాలుగు సార్లు హౌస్ అరెస్ట్ చేశారని.. దళితుల కోసం దళితబంధుపై మాట్లాడిన పాపానికి హౌస్ అరెస్ట్ చేశారన్నారు. ఇలా ఎక్కడికక్కడ రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధ కాండ జరుగుతుందని.. రాజ్యంగ హక్కుల ఉల్లంఘనపై నిలదీస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణ తల్లిపై వివాదమెందుకు?

ప్రత్యేక వార్త

కరపత్రం సిటీ బ్యూరో సిహెచ్ మహేష్ తో కలిసి కరుణాకర్ మల్లిగారి




తెలంగాణ తల్లి విగ్రహ వివాదంపై, నిన్నటి నుండి సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్ట్ సంచలనం రేపుతున్నది.పాత విగ్రహం రాచరికపు హావభావాలను ప్రతిబింబిస్తున్నదని, కాబట్టి కొత్తగా తెలంగాణ తల్లి విగ్రహం రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించడం తెలంగాణ ప్రజలకు నచ్చడం లేదు.పోయిన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన విగ్రహం కాదని బహుజనుల ప్రతిరూపంగా కొత్త నమూనా రూపొందించారట. సబ్బండ వర్గాల ప్రతినిధిగా ఈ కొత్త రూపమట.ముఖ్యమంత్రి నోటి నుండి ఇలాంటి మాటలు వెలువడడం బాగాలేదని, ఢిల్లీ లోని జాతీయ విద్యా ప్రణాళిక, నిర్వహణ సంస్థ (ఎన్ఐఇపిఏ) లో అసోయేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న శ్రీ పారిపెల్లి శంకర్ గారు కరపత్రం తో అన్నారు.అంటే బహుజనులు,సబ్బండ వర్గాలు ఎలాంటి అలంకరణ చేసుకోకూడదా?

మన స్వంత తల్లికి అలంకారాలు ఉండకూడదని మనం కోరుకుంటామా? అని అన్నారు.తెలంగాణ పల్లెలో సామాన్య ప్రజల నుండి సబ్బండ వర్ణాల వరకు ధరించే నగలను తెలంగాణ తల్లి ప్రతిబింబించడం లేదు.తెలంగాణలో సగటు మహిళకు చెంపల చేర్లు,కమ్మలు, గువ్వ గున్నలు, కత్తెర బాడీ లు, గాజులు, మెడలో కంటె, కంటె నాను, కాళ్ళ పట్టీలు,కాళ్ళ కడియాలు, సాలం కడియాలు, దండె కడియాలు, చెక్కుడు గుత్తి, ఒడియాలంముక్కుకు ముక్కెర , ముత్యము , పగడము లతో కూడిన నల్లపూసల గొలుసు, .. ఇవి తెలంగాణ సాంస్కృతిక ఆభరణాలు.ఈ నగలన్నీ తెలంగాణ బహుజన స్త్రీ,సబ్బండ వర్గాల స్త్రీ సగటు ఆడపడుచు అలంకరణలు అని శంకర్ గారన్నారు.కాని తెలంగాణ తల్లి విగ్రహం సగటు బహుజన స్త్రీ రూపాన్ని,సబ్బండ వర్గాల స్త్రీ రూపాన్ని ప్రతిబింబించడం లేదు.ముఖకవలికలను బట్టి కూడా తెలంగాణ జన సామాన్య మాతృమూర్తిని కొత్త రూపం ప్రతిబింబించడం లేదు . ముఖ కవళికలు చూసి, చీర కట్టును చూసి ఎవరైనా తెలంగాణ ప్రాంతమా, ఆంధ్ర ప్రాంతమా గుజరాతా, మహారాష్ట్రనా అని చెప్పవచ్చు.కాని,ఈ కొత్త తెలంగాణ తల్లిని చూసి ఏ ప్రాంత రూపమో మనం చెప్పలేం. చీర కట్టు కూడా మన తెలంగాణ సాంప్రదాయాన్ని పూర్తిగా ప్రతిబింబించినట్టు కనిపించడం లేదు. చేతిలో కొడవలి, నెత్తి పైన గడ్డిమోపు ముఖంలో ఆత్మవిశ్వాసం , చెదరని చిరునవ్వు ఇలాంటి మాతృమూర్తులను తెలంగాణ ప్రతి పల్లెలో మనం నిత్యం చూస్తూనే ఉంటాం. మరి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఈ సాంస్కృతిక ప్రతిబింబాలు కనిపించడం లేదు.తెలంగాణ ఉద్యమ సమయంలో టిఆర్ఎస్ / బిఆర్ఎస్ పార్టీ గత పాలక ప్రభుత్వము పై చేసిన విమర్శలకు మరింత ఆస్కారం ఇచ్చే విధంగా ఈ విగ్రహ రూపకల్పన ఉన్నది.ఈ కొత్త విగ్రహ రూపం కూడా రాచరికపు పోకడలకే




ఆనవాలుగా, తెలంగాణ ఆచార వ్యవహారాలను కించ పరిచే విధంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. అందంగా ముస్తాబు చేస్తే, అది రాజరికపు హావభావాల రూపంగా ఉంది అనిపిస్తే, తెలంగాణ తల్లిని అసలు సిసలు శ్రమైక సౌందర్యాన్ని ప్రతిబింబించే రూపంతో ఆవిష్కరిస్తే సరిపోయేది. తెలంగాణ ప్రాంతమంతా మన దేవతా విగ్రహాలు ఎల్లమ్మ,పోచమ్మ మైసమ్మ కూడా ఆంధ్ర ప్రాంతపు దేవత విగ్రహాల కన్నా భిన్నంగా ఉంటాయి.అది గమనిస్తే విగ్రహరూప కర్తలకు ఇబ్బంది ఉండకపోయేది. ఏది ఏమైనా, తీవ్రమైన విమర్శలు వచ్చినప్పుడు, ముఖ్యంగా అవి సాంస్కృతిక ప్రతిబింబాలు అయినప్పుడు సరిదిద్దుకుంటే మంచిదని అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీ పారిపెల్లి శంకర్ గారు తన అభిప్రాయాన్ని కరపత్రం సిటీ బ్యూరో మహేశ్వర్ తో ఫోన్లో మాట్లాడుతూ తన అభిప్రాయం చెప్పారు. రాజకీయ విభేదాలు మాతృ భావానికి, మాతృ గౌరవానికి అవరోధం కాకూడదని అన్నారు.తెలంగాణతో పాటు విశాల కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలిన రాణి రుద్రమ ను అలంకారంతో చూడకూడదా? అని శ్రీ శంకర్ గారు అన్నారు.తెలంగాణ తల్లిని అలంకారంతో చూడ కూడదా? అని అన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలా మాతృ భావాన్ని,మాతృ రూపాన్ని కించపరచడం భావ్యం కాదని అన్నారు.

**తెలంగాణను కాంగ్రెస్ కంటే ముందు, స్వాతంత్ర పూర్వం నైజాం ముస్లిం రాజులు పాలించారు.మరి ఆ ముస్లిం రాజుల సంస్కృతిలో స్త్రీని ఘోషా లో ఉంచడం వారి పద్ధతి.కాబట్టి ముస్లింల సాంప్రదాయం ప్రకారం తెలంగాణ తల్లికి నకాబ్ కానీ బురా? కాని కప్పి, విగ్రహం పెడితే సరిపోతుందని ప్రచారంలో ఉన్న పోస్టు లో**

**తెలంగాణ ప్రజల భాధ వ్యక్తం అవుతున్నదని శ్రీ శంకర్ గారన్నారు**

.తెలంగాణ తల్లి అనేది ఒక పవిత్ర భావన. ఈ నేల తల్లిని సాకార రూపంలో చూసుకుని ఆరాధించే పూజ్య భావన.

ఈ నేలను భరత మాత అని పిలిచినా, తెలంగాణ తల్లి అని పిలిచినా, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఎన్ని రూపాల్లో కొలిచినా ఒక్కటే.నేల తల్లి అని, నదీమ తల్లి అని భారతీయులు నిత్యం ప్రార్థిస్తారు. ప్రకృతి మాత అంటాం.ఇంతటి పవిత్ర భావనకు రాచరికపు వాసనలు అంటగట్టడం భావ్యం కాదని శ్రీ శంకర్ గారు అన్నారు.బతుకునిచ్చే మన తల్లిని అష్ట లక్ష్మీ దేవతలుగా కొలిచే జాతి మనది.ఇంతటి మహోన్నత నేలకు మనం ఎప్పుడూ కృతజ్ఞులమే.?

**భారతావని పసిడి కూన, కోటి కోటి రతనాల వీణ మన తెలంగాణ**

అని అన్నారు.తెలంగాణ తల్లి రూపాన్ని రాజకీయ కక్షలకు వాడుకోకూడదని అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ శంకర్ గారు అన్నారు.


Sri Paripelli Shankar
Asst Professor
National Institute of Educational Planning and Administration
(NIEPA) New Delhi

## సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విరాళాల సేకరణ

- దేశ రక్షణ కోసం సాయుధ దళాలకృషి కీలకమైనది
- భారత దేశ రక్షణలో సాయుధ దళాల యుద్ధ వీరుల వీరోచిత పోరాటం మరువలేనిది
- సాయుధ దళాల యుద్ధవీరుల సేవలను కొనియాడిన
- డా. కూన వేణుగోపాలకృష్ణ రాష్ట్ర అధ్యక్షులు యువజన సంఘాల సమితి తెలంగాణ రాష్ట్రం







**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విరాళాల సేకరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షులు డా. కూన వేణుగోపాలకృష్ణ కార్యక్రమంలో పాల్గొని సైనికుల సంక్షేమం కోసం విరాళాల సేకరణ కార్యక్రమం తో పాటు ర్యాలీ నిర్వహించి అనంతరం మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సాయుధ దళాల యుద్ధ వీరుల వీరోచిత పోరాటం మరువలేనిది అని, భారతదేశ రక్షణ కోసం భారత సాయుధ దళాల వీరోచిత కృషి మరువలేనటువంటిదని భారత యుద్ధ వీరుల సేవలను కొనియాడం జరిగింది,

భారత దేశాన్ని కాపాడుకోవడం కోసం యువతరం స్ఫూర్తిగా నిలవాలని ప్రసంగించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంగం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు దశరథ్, మునిరత్న, మాజీ సైనికుల కార్యాలయం సూపరిడెంట్ శివకుమార్, సిబ్బంది సయ్యద్ నాగేశ్వరరావు ఎన్ సి సి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## రైతు సంఘ నాయకునికి పరామర్శ



**ఆకుల రంజిత్,కరపత్రం కోరుట్ల**

మున్నూరు కాపు రైతు సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఎలిశెట్టి గంగారెడ్డి తల్లి రాజుబాయి అనారోగ్యంతో బాధపడుతు సోమవారం మృతి చెందగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ దాసర్ల శ్రీశైలం, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ లు గంగారెడ్డిని పరామర్శించారు.

ఆదివారం కోరుట్ల పట్టణంలోని గంగారెడ్డి నివాసంలో వారి కుటుంబీకులను కలిసిన నాయకులు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి వెంట నాయకులు బొల్లారం అరుణ్ కుమార్, శనిగారపు రాజేష్, శ్యామ్ తదితరలు వున్నారు.

## మొలంగూర్ 703,378, ప్రభుత్వ భూమిలో ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి...

- పేదల కోసం రిలే నిరాహార దీక్ష...
- అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు గణేష్...




**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 8**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ము ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేయించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం పేదలకు పంచాలని, అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు మోరె గణేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నతాధికారులను కోరారు. ఆదివారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకర పట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గణేష్ మాట్లాడారు. మొల%శీ%గూర్ గ్రామంలో 703, 378 సర్వే నంబర్ లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు పేదల కోసం ఇండ్లను నిర్మాణం చేసి అందజేసిందని, ఇట్టి ప్రభుత్వ భూమిలో కొంతమంది భూస్వాములు, ధనికులు ప్రస్తుతం భూములను ఆక్రమించుకొని పేదలకు తీరని అన్యాయం చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి ఉన్న ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, స్పందించి, తెలంగాణలోని బీద, ఇండ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ లక్ష్మీ ద్వారా అందజేస్తున్న, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇండ్ల స్థలాలు లేని ఎస్సీ బీసీ మైనారిటీ అగ్ర పేదలకు ప్రభుత్వ భూమిలో స్థలాలను కేటాయించి నూతన గృహాల నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మొలంగూర్ గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని ఉన్నతాధికారులచే సర్వేలు నిర్వహించి, ప్రభుత్వము ప్రవేశపెట్టిన గృహ నిర్మాణం కోసం గ్రామంలోని పేదలకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ ఇందిర మైండ్లు మంజూరు చేయాలని కోరారు. ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, పేదలకు అందజేయడానికి నిర్లక్ష్యం చేస్తే శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మొలంగూర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 11వ తేదీన రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని, ఈ రిలే నిరాహార దీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అగ్ర పేదలందరూ , రాజకీయ పార్టీల నాయకులు , పార్టీలకు అతీతంగా పేదల కోసం పోరాటం చేస్తున్న,తనకు అండగా ఉండాలని గణేష్ కోరారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాకయ్య స్వామి మఠంలో ప్రత్యేక పూజలు...

**కరపత్రం న్యూస్,బోధన్ డిసెంబర్08..**

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల కాకయ్య స్వామి మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్య షష్టి పండుగ సందర్భంగా 50 సంవత్సరాల క్రితం మఠంలో వెలిసిన శ్రీ కాకయ్య దేవాలయానికి గాండ్ల కులస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గాండ్ల తేలికుల సభ్యులు కాకయ్య దేవునికి మూడు కిరీటాలు చేయించి, మంగళ వాయిద్యాల నడుమ, అభిషేకాలతో శనివారం సాయంత్రం కిరీటాలంకరణ చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ పూజ కార్యక్రమంలో శ్రీ కాకతీయ దేవుని మఠాధిపతి గంగాధరప్ప, గాండ్ల నాగేశ్వరరావు, గాండ్ల అనిల్ కుమార్, గాండ్ల సంతోష్ కుమార్, గాండ్ల గంగాధర్, గాండ్ల అశోక్, తేలి సురేష్, గాండ్ల సతీష్, గాండ్ల సందీప్, గాండ్ల రాజు, గాండ్ల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం

**కరపత్రం నిజామాబాద్ ప్రెస్ క్లబ్,డిసెంబర్ 08:**

ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు,అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య వర్మ అన్నారు.నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ప్రైవేట్ ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తాను 18 సంవత్సరాల నుంచి పోరాడుతున్నానని,అందరి మద్దతుతో మండలి ఎన్నికల బరిలో నిలుస్తున్నానని అన్నారు.తనను ఆదరించాలని కోరారు.ఈ సమావేశంలో టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజేశ్ యాదవ్,టీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రాజు,టీఎల్ఎఫ్ నిజామాబాద్ నగర అధ్యక్షుడు గజానంద్,జిల్లా నాయకులు నవీన్,శ్రీకాంత్,మురళి,విజయ్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీఎస్ఐ చర్చిలో ప్రజాపాలన ఉత్సవాల ఇంచార్జికి సన్మానం

**కరపత్రం నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 08 :**

జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో కాంగ్రెస్ ఏడాది ప్రజాపాలన ఉత్సవాల ఇన్ చార్జి సముద్రాల వేణుగోపాలచారి,నుడా చైర్మన్ కేశ వేణు,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్ ను ఘనంగా సన్మానించారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని,చర్చిల మరమ్మతులకు కృషి చేస్తుందని,ఎటువంటి సమస్యలున్నా నుడా చైర్మన్ కేశ వేణు దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు రీవా జార్జ్,ఇన్ చార్జి రెవా ప్రకాశ్,రెవ కృపాకర్,ప్రధాన కార్యదర్శి సుధీర్,కాంగ్రెస్ నాయకుడు బెన్సన్(బెన్నీ) తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం డిసెంబర్ 9 2024

# మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధి నా లక్ష్యం..

# రూ.360.02 కోట్లు మంజూరు చేయించా...

– ఏడాది పాలనపై ప్రగతి నివేదిక విడుదల చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**కరపత్రం శంకర పట్నం డిసెంబర్ 8**
మానకొండూర్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వివిధ శాఖల ద్వారా 360 కోట్ల 2 లక్షల 80వేల రూపాయల నిధులను మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రగతి నివేదికను ఆదివారం పత్రికలకు విడుదల చేశారు. ఎల్ఓసీల కింద రూ. 3.06 కోట్లు,ఎల్.ఓ.సీల కింద మానకొండూర్ మండలానికి రూ.63 లక్షలు, తిమ్మాపూర్ మండలానికి 34 లక్షల 65 వేలు, శంకరపట్నం మండలానికి 69 లక్షల 10వేలు, గన్నేరువరం మండలానికి 9 లక్షల 50వేలు, బెజ్జంకి మండలానికి 43 వేలు, ఇల్లంతకుంట మండలానికి 69లక్షల 28వేల రూపాయలు, ఇతర మండలాల చెందిన వారికి 17లక్షల 50వేల రూపాయలు వెరసి 3కోట్ల 6 లక్షల 5వేల రూపాయల నిధులు మంజూరు కాగా, లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశామని ఎమ్మెల్యే వివరించారు.సీఎంఆర్ఎఫ్ కింద రూ.7.30 కోట్లు
ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ నుంచి మానకొండూర్ మండలానికి 1,60,85,500 రూపాయలు, తిమ్మాపూర్ మండలానికి 1,34,85,500, శంకరపట్నం మండలానికి 1,01,80,000, గన్నేరువరం మండలానికి 46,14,500, బెజ్జంకి మండలానికి 46,14,500, ఇల్లంతకుంట మండలానికి 1,20,54,000, ఇతర మండలాల వారికి 1,20,54,000 వెరసి మొత్తం నియోజకవర్గానికి 7కోట్ల 30 లక్షల 88వేల రూపాయలు మంజూరైనట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు.కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ కింద రూ. 5.37 కోట్లు,కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ మానకొండూర్ మండలానికి 1,71,19,836 రూపాయలు, తిమ్మాపూర్ మండలానికి 1,14,13,224, శంకరపట్నం మండలానికి 74,08,854 గన్నేరువరం మండలానికి 83,09,628, బెజ్జంకి మండలానికి 50,05,800, ఇల్లంతకుంట మండలానికి 45,05,220 రూపాయలు మొత్తం నియోజకవర్గానికి 5కోట్ల 37 లక్షల 62వేల 292 రూపాయలు మంజూరైనట్టు ఎమ్మెల్యే వివరించారు.ఇతర నిధుల నుంచి రూ. 123.11 కోట్లు,ఇతర నిధుల నుంచి మానకొండూర్ మండలానికి 13,03,90,000 రూపాయలు, తిమ్మాపూర్ మండలానికి 7,61,50,000, శంకరపట్నం మండలానికి 5,92,50,000 గన్నేరువరం మండలానికి 81,29,70,000,బెజ్జంకి మండలానికి 7,51,75,000 ఇల్లంతకుంట మండలానికి 7,72,25,000 రూపాయలు వెరసి మొత్తం నియోజకవర్గానికి 123 కోట్ల 11 లక్షల 60వేల రూపాయలు మంజూరయ్యాయని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కు రూ.220 కోట్లు తిమ్మాపూర్ మండలం యాదవులపల్లి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కోసం 220 కోట్లు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. అంతేకాకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సంబంధించి 81 కాంపోనెంట్స్ కు 79,26,000 రూపాయలు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కింద 58 పాఠశాలలకు 37,40,028 రూపాయులు మంజూరైనట్టు ఎమ్మెల్యే వివరించారు. మానకొండూరు నియోజకవర్గం అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ వెల్లడించారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు కొనసాగిస్తాం

– సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 8**
పేద బడుగు బలహీన వర్గాల కు అండగా అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని సీపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి అన్నారు.ఆదివారం రోజున స్థానిక పార్టీ కార్యాలయంలో వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ఒక్క ఫ్రీ బస్సు తప్ప మిగతా 5 గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదు అన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలని అన్నారు.నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి ఉద్యోగాలు లేని యువతకు నిరుద్యోగ భృతి కేటాయించాలని డిమాండ్ చేశారు.రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని, బి ఆర్ ఎస్ హాయంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. రేషన్ కార్డు లేనటువంటి అర్హులకు వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రజా సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని, ప్రజా అనుకూల నిర్ణయాలను స్వాగతిస్తామని అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీ లేని పోరాటాలు ఉధృతంగా కొనసాగిస్తామని అన్నారు. మతం పేరుతో కులం పేరుతో బిజెపి చేస్తున్న విభజన రాజకీయ కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. దేశభక్తి పేరుతో దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు అప్పగిస్తున్నారన్నారు. ప్రజల కనీస అవసరాలు, దేశభివృద్ధికి ఉపయోగపడే నిర్ణయాలు చేయాలని అన్నారు.బిజెపి అధికారంలోకి వచ్చాక దేశానికి అన్నం పెట్టే రైతులను చిత్రహింసలకు గురి చేస్తుందని ఢిల్లీలో లక్షలాదిమంది రైతులు ఆందోళన పోరాటాలు చేస్తుంటే ఉద్యమాలను అణిచివేస్తూ రైతుల మీద భాష్పవాయువు రబ్బర్ తూటాలు పేల్చుతూ రైతులను తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నారని రైతు వ్యతిరేక,కార్మిక వ్యతిరేక, మహిళా వ్యతిరేక బిజెపి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, కొప్పుల శంకర్,నాయకులు సమ్మయ్య పాల్గొన్నారు.

## జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగిన డిపార్ట్మెంటల్ పరీక్ష



**కరపత్రం రామగిరి ప్రతినిధి, డిసెంబర్ 8.**
తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమీషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డిపార్ట్మెంటల్ పరీక్ష మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షలో 140 మందికి గాను 39 మంది గైర్హాజర్ కాగా 101 మంది హజరైనట్టు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 140 మందికి 112 మంది హజరుకాగా 28 మంది గైర్హాజరైనారన్నారు. డిపార్ట్మెంట్ పరీక్ష సందర్భంగా రామగిరి ఎంపిడివో ఆధ్వర్యంలో పన్నూరు గ్రామపంచాయితి సిబ్బంది శానిటేషన్ చేశారు. రామగిరి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద, చేతులమీదుగా కామధేను రాష్ట్ర స్థాయి అవార్డు పురస్కారాన్ని అందుకున్న

### ప్రముఖ సంఘ సేవకులు కేజేఆర్ ఫౌండేషన్ అధినేత కొత్వాల్ ఆనంద్ కృష్ణారెడ్డి

– నా సేవలను గుర్తించి విశ్వ గురువు వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో
– కామదేను రాష్ట్ర స్థాయి అవార్డును అందుకోవడం ఆనందంగా ఉంది అన్న
– కేజేఆర్ ఫౌండేషన్ అధినేత ప్రముఖ సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి



**కరపత్రందినపత్రిక సంగారెడ్డి జిల్లా**
విశ్వ గురు వరల్డ్ రికార్డ్ వారి ఆధ్వర్యంలో కామదేను 2024 అవార్డ్స్ ను వివిధ రంగాలలో సేవను అందిస్తున్న ప్రముఖులను గుర్తించి అవార్డులు ప్రధానోత్సవం చేయడం జరిగింది. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ ప్రాంతానికి చెందిన కేజేఆర్ ఫౌండేషన్ అధినేత ప్రముఖ సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా సేవలో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ పేదల సంక్షేమం అభివృద్ధి తన ఎజెండాగా ప్రజల శ్రేయస్సు తన కర్తవ్యం గా ప్రజల కొరకు అబాద్యులకు ఆపన్న ఆస్తంగా అన్నా ఆపద అంటే నేనున్నాను మీకు అండగా అంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి కొత్వాల్ ఆనంద్ కృష్ణారెడ్డి కి విశ్వగురు వరల్డ్ రికార్డ్ సంస్థ ఆనంద్ కృష్ణారెడ్డికి హైదరాబాదులోని తెలంగాణ టూరిజం ప్లాజాలో "తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద" సంస్థ ప్రతినిధులు డా. సత్య వోలు రాంబాబు వ్యవస్థాపక సీఈవో విశ్వగురు వరల్డ్ రికార్డ్ కార్యక్రమ చైర్మన్ ప్రొఫెసర్ డా. సారంగపాణి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఆర్. కే. ఆర్. ప్రభుత్వ ఆయుర్వేదిక్ కాలేజ్ హైదరాబాద్, అతిథులు బండి శ్రీనివాస్ రఘువీర్ చైర్మన్ ప్రైమ్ 9న్యూస్ వీరి చేతుల మీదుగా ఘనంగా సన్మానించి అవార్డు ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకున్నందుకు సంతోషంతో పాటు నాలో ఇంకా ప్రజలకు మరింత సేవ చేయాలి అనేటువంటి కోరిక పెరిగిందని వారు తెలిపారు.

## ఆనందోత్సహాల నడుమ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.....



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట,డిసెంబరు08:**
ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు...2003-04 సంవత్సరం లో పదవ తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి పూర్వ విద్యార్థులందరూ ఒకచోట చేరడంతో సందడి నెలకొని ముఖాల్లో వెలుగులు నిండాయి. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపకలను అందజేశారు. 20 ఏళ్ల తర్వాత కూడా తమను గుర్తుంచుకొని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందని ఉపాధ్యాయులు అన్నారు. అనంతరం ఉపాధ్యాయుల చేత పూర్వ విద్యార్థులు మెమొంటో అందుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడానికి కృషిచేసిన నహీం పాషా, సురేష్,లను విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేశారు...ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు మధునయ్య,లక్ష్మయ్య, జగన్మోహన్ రెడ్డి, , తిరుపతి, సర్వోత్తమ్ రెడ్డి, వేణు, శ్రీను ,పూర్వ విద్యార్థులు నహీం పాషా, సురేష్, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరేష్,గణపతి రాజు,రాములు, మహేందర్,స్వర్ణలత, మాలతి,రజిత,మమత పాల్గొన్నారు

## శరీర దానానికి ముందుకు వచ్చిన విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు..

– అభినందించిన ఉపాధ్యాయులు స్నేహితులు..



**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 8**
తన పదవీ విరమణ సభలో మరణానంతరం దేహదానం కోసం ముందుకు వచ్చారు ఓ ఉపాధ్యాయుడు. ఇటీవల ఉద్యోగ సంఘాల నేత,విశ్రాంత ఎంఈఓ వీరగోని పెంటయ్య తన సతీమణి లక్ష్మి మృతిచెందగా, ఆమె పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల కోసం చలి మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థకు అందజేసిన విషయం తెలిసిందే.ఆ స్ఫూర్తితోనే తాము కూడా మరణానంతరం దేహ దానం చేస్తామని సదరు ఉపాధ్యాయ దంపతులు ప్రకటించారు.పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడు నేదునూరి కనకయ్య పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా రేణుక -కనకయ్య దంపతులు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు టి. శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో శరీరదానానానికి ముందుకు రాగా వారిని ఫౌండేషన్ ప్రతినిధులు శాలువతో సత్కరించి,గ్రీన్ గిఫ్ట్ జ్ఞాపిక అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ సభ్యునిగా నేత్ర, అవయవ ,శరీర దాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే అవకాశం లభించింది అన్నారు. ఈ కార్యక్రమాల స్ఫూర్తితో మరణానంతరం తమ దంపతులు దేహదానం చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు.ఆదర్శవంతమైన ఈ నిర్ణయం పట్ల పదవి విరమణ సభకు అతిథులుగా విచ్చేసిన మండల విద్యాధికారులు సురేంద్ర కుమార్,ఆగయ్య,జిల్లా టిపిటి ఎఫ్ నాయకులు పోచయ్య, పరుశురాములు,రాజనర్సు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు జానకి,ప్రాథమిక పాఠశాల హెచ్.యం సుమిత్ర,గ్రామ నాయకులు నర్సింహా రెడ్డి, తిరుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, కనుకయ్య చిన్ననాటి స్నేహితులు నర్సయ్య,రాజయ్య,ఎర్రన్న , కిష్టయ్య దేహదాన నిర్ణయం తీసుకున్న దంపతులను సత్కరించి, వారి నిర్ణయాన్ని అభినందించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు